క్లుప్తంగా

ఆక్రమణపై ఫిర్యాదు

డెంకాడ: మండలంలోని పెదతాడివాడ పంచాయతీ పరిధిలోని సర్వే నంబర్ 101–23లో గల ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమిస్తున్నారని, అధికారులు స్పందించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన ఆదినారాయణ, రమేష్, ప్రసాద్, చిన్నారావు, తదితరులు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ పి. ఆదిలక్ష్మిని శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. గతంలో ఒకసారి అధికారులకు ఫిర్యాదు చేయగా.. ప్రభుత్వ భూమి అని పేర్కొంటూ బోర్డు ఏర్పాటు చేశారని, అయినప్పటికీ అక్రమార్కులు చెలరేగిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే అధికారులు స్పందించి ప్రభుత్వ భూమిని కాపాడుకోవాలని కోరారు.

శ్రీనివాసునికి పంచామృతాభిషేకాలు



శ్రీనివాసునికి అభిషేకం చేస్తున్న అర్చకుడు

విజయనగరం రూరల్: మండలంలోని దుప్పాడ గంగానగర్‌లో కొలువై ఉన్న శ్రీ అష్ట లక్ష్మీ సమేత ఐశ్వర్య వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీనివాసునికి శుక్రవారం పంచామృతభిషేకాలు నిర్వహించారు. శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని దేవాలయ అర్చకులు చామర్తి శ్రీనివాస రమేష్ ఆచార్యులు, చామర్తి రమేష్ ఆచార్యులు వేదమంత్రాల నడుమ శ్రీనివాసునికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఉత్సవంలో దేవాలయ ధర్మకర్తలు దుర్గాబాలాజీ, ఉమాదేవి దంపతులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడా దుస్తుల పంపిణీ



క్రీడాకారులకు దుస్తులు అందజేస్తున్న సర్పంచ్ సతీష్, తదితరులు

వేపాడ: మండలంలోని చామలాపల్లి పంచాయతీ పరిధి పోతుబందిపాలెంకు చెందిన గిరిజన క్రీడాకారులకు గ్రామ సర్పంచ్ కోలా సతీష్ శుక్రవారం క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. గ్రామీణ ప్రాంత యువత చదువులతో పాటు క్రీడల్లో రాణించాలని, పంచాయతీకి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు వెంకట సూరి, తదితరులు పాల్గొన్నారు.


న్యాయం కోసం..



పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న దళిత మహజన సభ నేతలు

జామి: మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన దళిత యువకుడు బసువు స్వామినాయుడు మార్చి 20న ఆటో ఢీకొని మృతిచెందిన విషయం విదితమే. మృతికి కారకుడైన ఆటో డ్రైవర్‌ను అరెస్టు చేయాలని, మృతుని కుటుంబానికి పరిహారం అందించి న్యాయం చేయాలని దళిత మహజన సభ జిల్లా అధ్యక్షుడు గంటాన అప్పారావు, జిల్లా నాయకులు ఆతవ ఉదయ్‌భాస్కర్, పత్రి అప్పారావు, బీఎస్పీ నేత గాలి చైతన్యకుమార్, తదితరులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుట శుక్రవారం ఆందోళన చేపట్టారు. మృతికి కారకులైనవారిని శిక్షించాలని, లేదంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

శ్మశానవాటికలో బోరు ఏర్పాటు



శంకుస్థాపన చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చీపురుపల్లి: పట్టణంలోని కుమ్మరికాలనీలో ఉన్న శ్మశానవాటికలో బోరు ఏర్పాటుకు వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బెల్లాన వంశీకృష్ణ శుక్రవారం శంకుస్థాపన చేశారు. రూ.1.25 లక్షలు ఎంపీపీ గ్రాంట్ నిధులతో బోరు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కుమ్మరికాలనీ శ్మశానవాటికకు రహదారి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతుండేవారని, ఎంపీ నిధులతో రహదారి నిర్మాణంతో పాటు శ్మశానవాటిక అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గిరిడ రాందాసు, మంగళగిరి శ్రీను, కరణపు ఆది, సూరు దుర్గారావు, ఒమ్మి రమేష్, సూరు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జగన్ నాయకత్వంపై నమ్మకం..

- రాష్ట్రంలో నిరాటంకంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు
- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



విజయనగరం: ధర్మపురిలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం:

ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వంపై ప్రజలకు నమ్మకం పెరుగుతోందని.. అందుకే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేష స్పందన వస్తోందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నగరంలోని 30వ డివిజన్ ధర్మపురి ప్రాంతంలో నాలుగో రోజు శుక్రవారం నిర్వహించిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తూ, ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోలగట్ల మాట్లాడుతూ, రాష్ట్రాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తున్న ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, జోనల్ ఇన్‌చార్జ్ మారెం బాలబ్రహ్మరెడ్డి, స్థానిక కార్పొరేటర్ పతివాడ గణపతిరావు మాట్లాడుతూ, 30వ డివిజన్ పరిధిలో రూ.2 కోట్లతో వాటర్ ట్యాంక్ నిర్మించి, ప్రజల దాహార్తిని తీర్చే బృహత్తర కార్యక్రమానికి కోలగట్ల కృషి చేస్తున్నారన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పర్యటిస్తున్న ప్రతి ప్రాంతంలో ముఖ్యంగా మహిళలు జగనన్నపై అభిమానాన్ని బహిరంగంగానే వెల్లడిస్తుండడం శుభపరిణామమన్నారు. నవరత్నాల్లో భాగంగా అమ్మఒడి, ఆసరా, పింఛన్లు, వసతిదీవెన, సున్నావడ్డీ వంటి అనేక సంక్షేమ పథకాలు ప్రతి కుటుంబానికీ అందుతుండడంతో సమాజం అభివృద్ధి చెందుతోందని చెప్పారు. రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగాలంటే త్వరలో జరగనున్న ఎన్నికల్లో జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని, కోలగట్ల వీరభద్రస్వామిని ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేవతీదేవి, జోనల్ ఇన్‌చార్జ్ బొద్దాన అప్పారావు, డివిజన్ ఇన్‌చార్జ్ పూసర్ల శ్రీనివాసరావు, మహిళా అధ్యక్షురాలు చందక ఆదిలక్ష్మి, యువజన అధ్యక్షుడు సువ్వాడ జయరాం, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా సంక్షేమ ఫలాలు ..

- ఎమ్మెల్యే బడ్డుకొండ

పూసపాటిరేగ : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటా సంక్షేమ వెలుగులు వెల్లివిరుస్తున్నాయని నెల్లిమర్ల శాసనసభ్యుడు బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని చినపతివాడ, పతివాడబర్రిపేట గ్రామాలలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొనగా గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, అధికారులతో కలిసి బడ్డుకొండ ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల వల్ల లబ్ధిని వివరించారు. అలాగే ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గృహాలు మంజూరు చేయాలని, డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని, తాగునీటి సమస్య పరిష్కరించాలని స్థానికులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలన్నీ సానుకూలంగా విన్న ఎమ్మెల్యే వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందడానికి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. ప్రభుత్వ సేవలు పొందేందుకు ఏ ఒక్కరూ ఇబ్బంది పడకూడదనే సచివాలయాలు ఏర్పాటు చేశారని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలే మంత్రంగా వచ్చే సార్వత్రిక ఎన్నికలకు వెళ్తామన్నారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, వైస్ ఎంపీపీ ఎస్.సత్యనారాయణరాజు, ప్రజాప్రతినిధులు మహంతి శ్రీనివాసరావు, మహంతి జనార్దన రావు, పిన్నింటి నారాయణరావు , పిన్నింటి ఎల్లం నాయుడు, పతివాడ సూరిబాబు, పతివాడ రాము నాయుడు, పతివాడ సత్యం, పాలూరి జగన్నాథం, పతివాడ కన్నంనాయుడు, పాలూరి సీతారాములు, బర్రి అప్పలస్వామి, తదితరులు పాల్గొన్నారు.



చినపతివాడలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, తదితరులు

నిరంతరం అభివృద్ధి కార్యక్రమాలు



రోడ్డును ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, నగర మేయర్

- రూ.15.70 లక్షలతో వేసిన రోడ్డును ప్రారంభించిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం: కార్పొరేషన్ హోదా దక్కించుకున్న విజయనగరంలో నిరంతర ప్రక్రియగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నగరంలోని 43వ డివిజన్ ఉడాకాలనీ ఫేజ్‌- 1 ప్రాంతంలో రూ.15.70 లక్షలతో పూర్తి చేసిన రహదారులను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి శుక్రవారం ప్రారంభించారు. స్థానికులు ఎమ్మెల్యే కోలగట్ల, తదితరులకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జ్ డాక్టర్ వీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ, నగరంలోని అన్ని ప్రాంతాలలో ప్రజావసరాలను తీర్చేదిశగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ప్రధాన జంక్షన్ల అభివృద్ధితో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. గతంలో మంత్రులుగా, కేంద్ర మంత్రులుగా అధికారం చెలాయించిన వారు జిల్లాను అభివృద్ధి చేయలేకపోయారని ఎద్దేవా చేశారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక నాలుగేళ్లలో నగరాన్ని అభివృద్ధి చేసిన ఘనత కోలగట్లకే దక్కుతుందన్నారు. డివిజన్ కార్పొరేటర్ దాసరి సత్యవతి మాట్లాడుతూ, తమ డివిజన్‌లో ఎన్నడూ లేనివిధంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అభివృద్ధిని చేసి చూపిస్తున్నారని కొనియాడారు. మహిళల కోసం ప్రత్యేకంగా పార్కును ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

డ్రాయింగ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



గీచిన చిత్రాలను చూపిస్తున్న విద్యార్థులు

డెంకాడ: వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా డెంకాడ శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు శుక్రవారం డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో జి. కావ్య, ఎస్.జ్యోత్స్న, కె. కార్తీక్ విజేతలుగా నిలిచారని లైబ్రేరియన్ వై. మహేష్ తెలిపారు.

కేంద్ర గ్రంథాలయంలో..



విజయనగరం అర్బన్: గీసిన చిత్రాలతో విద్యార్థులు

విజయనగరం అర్బన్: నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన చిత్రలేఖనం పోటీలు ఆకట్టుకున్నాయి. వివిధ పాఠశాలల నుంచి 87 మంది విద్యార్థులు పోటీలో పాల్గొన్నారు. గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి ఎస్.లలిత ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గ్రంథాలయ సీనియర్ సభ్యుడు బాషా, విద్యార్థులు పాల్గొన్నారు.

త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు



సచివాలయ కార్యదర్శులతో మాట్లాడుతున్న రమణమూర్తి

- జిల్లా హౌసింగ్ అధికారి ఎస్‌వీ రమణమూర్తి

నెల్లిమర్ల: ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని జిల్లా హౌసింగ్ అధికారి ఎస్‌వీ రమణమూర్తి ఆదేశించారు. హౌసింగ్ డేను పురస్కరించుకుని నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేట జగనన్న కాలనీని కమిషనర్ పి. బాలాజీ ప్రసాద్‌తో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. 88 ఇళ్లు ఇంకా పునాది దశలోను.. ఆరు ఇళ్లు ఇంకా ప్రారంభించలేదని గుర్తించారు. ఇప్పటికీ నిర్మాణాలు ప్రారంభించని వారికి నోటీసులు జారీ చేసి, వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు చేపట్టాలన్నారు. లేని పక్షంలో రద్దు చేసి అర్హులైన ఇతరులకు కేటాయించాలని సూచించారు. అలాగే పునాది దశలోనున్న ఇళ్లకు జూన్ నెలాఖరులోగా శ్లాబ్ వేసేలా చర్యలు తీసుకోవాలని సచివాలయ కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈఈ జి. మురళీమోహన్, ఏఈఈ ఆర్. పవన్ తదితరులున్నారు.

నైటింగేల్ సేవలు స్ఫూర్తిదాయకం



ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పిస్తున్న సీహెచ్‌సీ వైద్య సిబ్బంది

భోగాపురం: నర్స్ ఫ్లోరెన్స్ నైటింగేల్ రోగులకు అందించిన సేవలు స్ఫూర్తిదాయకమని సీహెచ్‌సీ వైద్యాధికారి పి.సునీల్ అన్నారు. శుక్రవారం నర్సు ల దినోత్సవం సందర్భంగా సుందరపేట సీహెచ్‌సీ లో డాక్టర్ సునీల్, సిబ్బంది ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వాస్పత్రుల్లో విధులు నిర్వహిస్తున్న నర్సులందరూ నైటింగేల్‌ను ఆదర్శంగా తీసుకుని ఆస్పత్రికి వచ్చే రోగులకు ఉత్తమమైన సేవలందించాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు వెంకటేష్, శాలిని, వెంకటరమణ, స్టాఫ్ నర్స్, సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కజొన్న కొనుగోలు వేగవంతం చేయాలి

- జేసీ మయూర్ అశోక్



మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జేసీ మయూర్ అశోక్

జామి: త్వరితగతిన మొక్కజొన్న కొనుగోలు చేపట్టాలని జేసీ మయూర్ అశోక్ అన్నారు. మండలంలోని అన్నంరాజుపేట గ్రామంలో శ్రమశక్తి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఇప్పటివరకు జరిపిన కొనుగోళ్లు, కేంద్రం నిర్వహణ తదితర అంశాలపై ఆరా తీశారు. మొక్కజొన్న బస్తాలకు టాగింగ్ విధానాన్ని పరిశీలించారు. రైతులతో మాట్లాడి ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. రోజుకు 100 టన్నులు చొప్పున పంట కొనుగోలు చేయాలని అధికారులకు సూచించారు. జేసీతో పాటు మార్క్‌ఫెడ్ డీఎం విమల, తహసీల్దార్ హేమంత్‌కుమార్, వ్యవసాయాధికారి కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

గుర్ల: మండలంలోని నడుపూరు రైతుభరోసా కేంద్రం వద్ద మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు పొట్నూరు సన్యాసినాయుడు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి తక్కువ ధరకు పంటను అమ్మి నష్టపోవద్దని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో మొక్కజొన్న పంటను విక్రయించి మద్దతు ధర పొందాలని కోరారు. కార్యక్రమంలో గూడేం సొసైటీ అధ్యక్షుడు రెడ్డి మురళి, బెల్లాన బంగారునాయుడు తదితరులు పాల్గొన్నారు.



గుర్ల: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, సొసైటీ అధికారులు

విజేతలకు ప్రశంసలు



జిల్లా జట్టుతో కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో జరిగిన సీఎం కప్ మహిళల కబడ్డీ పోటీల్లో విజేతగా నిలిచిన జిల్లా జట్టును జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు అభినందించారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి 5 వరకు తిరుపతి వేదికగా జరిగిన అంతర్ జిల్లాల కబడ్డీ పోటీల్లో జిల్లా మహిళల జట్టు ద్వితీయ స్థానం దక్కించుకున్న విషయం తెలిసిందే. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా ఖ్యాతిని చాటి చెప్పిన క్రీడాకారులపై అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జి.ఈశ్వర్‌కౌశిక్ ప్రశంసల వర్షం కురిపించారు. ఈమేరకు శుక్రవారం నగరంలోని రింగ్‌రోడ్ ప్రాంతంలో గల సుజాత కన్వెన్షన్ హాల్‌లో జరిగిన అభినందన సభలో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కాళ్ల సూరిబాబు, ఆర్గనైజింగ్ కార్యదర్శి పతివాడ శ్రీనివాసరావు, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఎల్‌వీ రమణ, వ్యాయామ ఉపాధ్యాయులు బాలకృష్ణ, సూర్యారావు, సుబ్రహ్మణ్యంరాజు, సీనియర్ క్రీడాకారులు కోటేశ్వరరావు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఆర్‌బీకేల్లో రైతుల వివరాలు

బొండపల్లి: రైతుభరోసా పొందేందుకు అర్హులైన రైతుల వివరాలు ఆర్‌బీకేల్లో అందుబాటులో ఉంచినట్లు మండల వ్యవసాయాధికారి పి.వి.మల్లికార్జునరావు తెలిపారు. మండలంలోని గరుడుబిల్లిలోని రైతుభరోసా కేంద్రంలో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆ జాబితాలో ఉన్న వివరాలను పరిశీలించుకుని, ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 20లోగా తెలియజేయాలని కోరారు. అలాగే ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులకు అవసరమైన పచ్చిరొట్ట విత్తనాలు ఆర్‌బీకేల్లో అందుబాటులో ఉన్నాయని, కావాల్సిన రైతులు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యానవనశాఖ అధికారి ఎ.రాజశేఖర్, వ్యవసాయ సలహా మండలి సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు బోద్దల చిన్నంనాయుడు, పంచాయతీ కార్యదర్శి ఎర్రినాయుడు, ఏఈఓ సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి

గజపతినగరం: భారతీయ జనతాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడి పిలుపుమేరకు గ్రామీణ ప్రాంతాల్లో పార్టీ బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నామని పార్టీ జిల్లా అధ్యక్షురాలు రెడ్డి పావని అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం పార్టీ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు కృషిచేయాలన్నారు. వచ్చేది బీజేపీ ప్రభుత్వమే అని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ టోర్నీ విజేతలకు నగదు బహూకరణ

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి మండలంలోని శేరీపేట గ్రామంలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంటులో విజేతలుగా నిలిచిన వారికి నగదు బహుమతులు అందజేశారు. రెండు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన గ్రామానికి చెందిన పొట్నూరు రాజేష్ జ్ఞాపకార్థం గ్రామ యువత, గ్రామపెద్దలు ఈ పోటీలు నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో విజేతగా విజయనగరం జట్టు, రన్నర్‌గా గరివిడి, తృతీయ స్థానంలో ఎంవీజీఆర్ కాలేజీ, నాల్గో స్థానంలో శేరిపేట జట్లు నిలిచాయి. విజేతలకు రూ.10 వేలు, రెండు, మూడు, నాలుగో స్థానంలో నిలిచిన జట్లకు రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేలు చొప్పున నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో పీడీలు జి.అప్పారావు, కె.హరిబాబు, గ్రామపెద్దలు పిల్ల అప్పారావు, పిల్ల ఆదినారాయణ, జమ్ము ఆదినారాయణ, గొరజాన రమణ, జమ్ము కృష్ణ, పెద్ద గురువులు పాల్గొన్నారు.

స్పెషల్ నిఘా..

- మాదకద్రవ్యాల రవాణా, వినియోగంపై స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారుల నిఘా..
- ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాల్లో విస్తృతంగా తనిఖీలు
- మత్తు వల్ల కలిగే అనర్థాలపై యువతకు అవగాహన



మైదానాల్లో వ్యాయామం చేస్తున్న యువతకు అవగాహన కల్పిస్తున్న సీఐ ఉమామహేశ్వరరావు



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్‌ఈబీ అధికారులు

చీపురుపల్లి: మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల తరలింపు, వినియోగాన్ని అడ్డుకునేందుకు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు పటిష్ట చర్యలు చేపడుతున్నారు. యువత మాదక ద్రవ్యాలకు బానిసలవ్వకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని ప్రభుత్వం ప్రత్యేక ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో జిల్లాలోని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఏఎస్పీ ఆస్మా ఫర్హీన్‌సూచనల మేరకు చీపురుపల్లి సర్కిల్ పరిధిలో నిఘా పెంచారు. ఎస్‌ఈబీ సీఐ ఉమామహేశ్వరరావు నేతృత్వంలో సర్కిల్ పరిధిలోని చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం మండలాల్లో మాదక ద్రవ్యాలు రవాణా, వినియోగంపై గట్టి నిఘా పెట్టారు. ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలతో పాటు రైళ్లలో ప్రతీరోజూ విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నట్లు సీఐ తెలిపారు.

యువత, విద్యార్థుల్లో అవగాహన

యువత మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారి జీవితాలు పాడు చేసుకోవద్దని ఎస్‌ఈబీ అధికారులు సూచిస్తున్నారు. చీపురుపల్లి ఎస్‌ఈబీ సర్కిల్ పరిధిలో కళాశాలలు, వసతిగృహాలు, క్రీడా మైదానాలతో పాటు గ్రంథాలయాలు, యువత అధికంగా ఉండే ప్రదేశాల్లో మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల వినియోగం ద్వారా కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం కళాశాలలకు వేసవి సెలవులు కావడంతో పట్టణంలోని జీవీఆర్ ప్రభుత్వ కళాశాల మైదానం, గరివిడి ఎస్‌డీఎస్ అటానమస్ కళాశాల మైదానంలో వ్యాయామం, ఆటలు ఆడుకునే యువత వద్దకు ఎస్‌ఈబీ అధికారులు వెళ్లి అవగాహన కల్పిస్తున్నారు.

నియంత్రణ కోసం ఫోన్ నంబర్

మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల వినియోగం, తరలింపుపై సమాచారం ఇచ్చేందుకు ప్రభుత్వం ఉచిత ఫోన్‌నంబర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఎక్కడైనా మత్తు పదార్థాలు విక్రయిస్తే 14500 నంబర్‌కు ఉచితంగా కాల్ చేసి సమాచారం ఇవ్వవచ్చు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతారు. మాదక ద్రవ్యాలు వినియోగించినా, విక్రయించినా కేసులు నమోదు చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ ఉమామహేశ్వరరావు హెచ్చరిస్తున్నారు.